ఘనంగా 62వ కెవిఎస్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కడప

ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయంలో 62వ కెవిఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మునేష్ మీనా, ముఖ్య అతిథి ఓబుల్ రెడ్డి కేంద్రీయ విద్యాలయ సంస్థాన్ చరిత్రపై ప్రసంగించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథి విద్యార్థులను ఆశీర్వదించి ప్రసంగించారు. తల్లిదండ్రులు కూడా కార్యక్రమాన్ని తిలకించారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థుల

ఏకగ్రీవమే!

- నోడ్యూస్ పేరుతో వైసిపి బాయ్‌కాట్
- సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులదే ఆధిపత్యం
- కడప 202, అన్నమయ్యలో 166 సంఘాలతో కూటమి
- గుండ్లకుంటలో వైసిపి మద్దతుదారుల గెలుపు
- పింఛా సాగునీటి ఎన్నిక వాయిదా

జిల్లా సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవాల పర్వం నడిచింది. జిల్లాలో శుక్ర, శనివారాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి దౌర్జన్యాన్ని ప్రశ్నించిన ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు ఎస్.వి సతీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం, వైసిపి మద్దతుదారుల పత్రాలను చింపివేయడం, మీడియాపై దాడికి తెగబడిన నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికలను వైసిపి భాయ్‌కాట్ చేసిన సంగతి తెలిసిందే. పెద్దముడియం మండలంలో గుండ్లకుంట సాగునీటి సంఘం మినహా మిగిలిన 202 సాగునీటి సంఘాలను టిడిపి, జనసేన, బిజెపి ఏకగ్రీవం చేసుకున్నాయి. అన్నమయ్య జిల్లాలో పింఛా వాయిదా మినహా మిగిలిన 166 సాగునీటి సంఘాలను ఏక గ్రీవం పేరుతో కూటమి పార్టీలు పంచుకుని సంబంరాలు చేసుకున్నాయి.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. కడప జిల్లాలోని 203, అన్నమయ్య జిల్లాలో 167 సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో కూటమి పార్టీలు ఏకగ్రీవాల హవాను కొనసాగించాయి. కడప జిల్లాలోని 203 సాగునీటి సంఘాల ఎన్నికలకుగానూ జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని పెద్దముడియం మండలం గుండ్లకుంట సాగునీటి సంఘానికి సంబంధించిన 12 టిసిల్లో ఏడింటిని వైసిపి, కూటమి ఒకటి గెలుచుకోగా మిగిలిన నాలుగింటిని నోడ్యూ సర్టిఫికెట్లు లేవనే పేరుతో వాయిదా వేసినట్లు సమాచారం. రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల ఈలెక్కన కడప జిల్లాలో కూటమి 202 స్థానాలను కూటమి పార్టీలు ఏకగ్రీవం చేసుకుంది. అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ నాయకత్వమైన సుగవాసి బాలసుబ్రమణ్యం, చమర్తి జగన్మోహన్‌రాజు అనుచరుల మధ్య కుమ్ములాటల నేపథ్యంలో ఒంటిమిట్ట సాగునీటి సంఘం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులను బిజెపి, సిపిఐ మద్దతుదారులు దక్కించుకోవడం గమనార్హం. పింఛా సాగునీటి సంఘాల ఎన్నిక విషయంలో నెలకొన్న పేచీ కారణంగా వాయిదా పడడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలోని 167 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. పింఛా సాగునీటి సంఘం ఎన్నిక మినహా జిల్లాలోని మిగిలిన 166 సాగునీటి సంఘాలను కూటమి పార్టీలు దక్కించుకున్నాయి. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి, ఎల్ఆర్‌పల్లి, గాలివీడు, రామాపురం మండలాలకు చెందిన 17 సాగునీటి సంఘాలను టిడిపి మద్దతుదారులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు టిసి మెంబర్లను, వైస్‌ప్రెసిడెంట్, ప్రెసిడెంట్లను ఎన్నుకున్నారు. మదనపల్లి అసెంబ్లీ పరిధిలోని 16 సాగునీటి సంఘాలన్నింటినీ టిడిపి ఏకగ్రీవం చేసుకుంది. ఇదేతరహాలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని సాగునీటి సంఘాలను కూటమి పార్టీలు ఏకగ్రీవాల పరంపరను కొనసాగించడం గమనార్హం.

మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప-తిరుపతి జాతీయ రహదారిపై శనివారం కొత్త బోయినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. రాజంపేట నుంచి కడప వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కడప నుంచి రాజంపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కడప జిల్లా పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి(20), అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.శ్రీకిరణ్‌కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందారు. కిరణ్ కర్నూలు జిల్లా కోవెలకుంట్ల వాసి. పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నట్లు సమాచారం. తన మిత్రుడు పుట్టినరోజు సందర్భంగా బద్రీనాథ్‌రెడ్డి చెన్నై నుంచి రాజంపేటకు వచ్చినట్లు సహచర విద్యార్థులు తెలిపారు. రూరల్ సిఐ మహమ్మద్‌అలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించామని సిఐ తెలిపారు. వారి తల్లిదండ్రులు వచ్చాక ఆదివారం పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు. **విద్యార్థుల మృతిపై మంత్రి దిగ్భ్రాంతి :** రాజంపేట కొత్త బోయినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతి వేగంతో యువకులు ప్రమాదాల బారినపడి ప్రాణాల కోల్పోవడం చాలా బాధకరంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రివర్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - కడప : ఇంధన భద్రత, పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. ఇంధనాన్ని పొదుపు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించడం వారోత్సవ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ పొదుపు వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం తన క్యాంపు ఆఫీసులో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమం పర్యావరణాన్ని కాపాడుకోవడానికి, శక్తిని పొదుపు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, శక్తిని పొదుపు చేయడం జీవితంలో భాగంగా చేసుకోవడానికి ప్రేరణ ఇస్తుందని తెలియజేశారు. శక్తిని పొదుపు చేయడానికి, శక్తి-తయారు చేసే పరికరాలను ఉపయోగించడం, పునరుద్ధరణ వనరులను ఉపయోగించడం వంటి విధాలుగా ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురుంచి ప్రజలలో అవగాహన కల్పించుటకు ప్రసంగాలు, ర్యాలీలు, విద్యార్థులలో అవగాహన కల్పించుటకు వ్యాసరచన పెయింటింగ్ పోటీలు, వర్క్ షాప్, వేబినార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిష్యత్ భావి తరాల వారికి వెలుగులు అందిచడం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతతో విద్యుత్ పొదుపు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్ పాల్గొన్నారు.

'ఫాతిమా'లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప : ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆస్పత్రి యాజమాన్యం సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో శనివారం రామనపల్లె గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మందికి పైగా ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వక్రమార్గం!

ప్రజాదృష్టి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మార్క్ రాజకీయం నడుస్తోంది. హౌస్ అరెస్టులు, సర్టిఫికెట్ల చింపివేత, దాడులు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని పరిహసించడం విస్మయాన్ని కలిగిస్తోంది. అప్రజాస్వామిక పద్ధతులతో కూటమి నాయకత్వం ఏకగ్రీవాలు చేసుకుంటోంది. అనైతిక పద్ధతులతో గెలిచే బదులు నామినేటెడ్ పోస్టుల తరహాలో కూటమి పార్టీ నాయకత్వానికి పదవులు కట్టబెట్టుకోవడం ఉత్తమమనే వాదన వినిపిస్తోంది. శుక్రవారం పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల, వేంపల్లి, తొండూరు, పెద్దముడియం మండల ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకత్వం ఎన్నికల పేరుతో అరాచకానికి పాల్పడడం ఆందోళనకరం. దౌర్జన్యపూరిత రాజకీ యాలను అధికార పార్టీ నాయకులు సమర్థించుకోవడం దిగజారుతున్న ప్రమాణాలకు నిదర్శనమని గ్రహించాలి. ఇది ట్రైలరేనని, ముందు ముందు సినిమా ఉంటుందని మీడియా ముఖంగా నిస్సిగ్గుగా వ్యాఖ్యానించడం దారుణం. ఇటువంటి ధోరణి నైతిక విలువలకు పాతర వేయడమే అవుతుందని గ్రహించాలి. ఫలితంగా ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతుందని గ్రహించాలి. సంప్రదాయాలతో ఎవరికి నష్టమో ఆలోచించుకోవాలి. గతంలో మీరు చేశారు కదా ఇప్పుడు మేం చేస్తామంటే చేసేదేమీ ఉండదు. సంప్రదాయం చివరికి ప్రజాస్వామ్యాన్ని పరిహాసంపాలు చేయడమే అవుతుందనడంలో సందేహం లేదు. అనైతిక పద్ధతులతో గెలిచేదాని కంటే సక్రమ మార్గంలో ప్రయత్నించి ఓడిపోవడమే మేలని ప్రథమ ప్రధాని నెహ్రూ వ్యాఖ్యలను స్మరణకు తెచ్చుకోవాలి. ఎన్నికల్లో ఇటువంటి విపరీత ధోరణులకు పాల్పడితే భవిష్యత్‌లో ఎప్పటికీ ఎవరికి ఎటువంటి ప్రయోజనం చేకూరదని గ్రహించాలి. అంతిమంగా జాతి భవిష్యత్ అగమ్య గోచరంగా మారే అవకాశం ఉంది. దిగజారిన రాజకీయాలతో ప్రజాస్వామ్యం బలహీనపడే అవకాశాలు ఉన్నాయని గ్రహించుకోవాలి. విపరీత ధోరణులతో ముందుకెళ్తే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా ప్రజల్లో చులకనగా మారిపోయే అవకాశం కనిపిస్తోంది. ఫలితంగా దేశానికి స్ఫూర్తి దాయకమైన నాయకత్వం లభించడం దుర్లభంగా మారనుంది. ఏడు దశాబ్దాలుగా దేశానికి ఆదర్శవంతమైన దూరదృష్టి కలిగిన నాయకత్వ లోపం కారణంగా దేశాభివృద్ధి కుంటి నడకన నడుస్తోంది. భారత్ కన్నా వెనుక స్వాతంత్ర్యం పొందిన దేశాలు అభివృద్ధి పథంలో మూడు తరాలు ముందంజలో నడుస్తుండడం నడుస్తున్న చరిత్ర, ఇప్పటికైనా దేశ, రాష్ట్ర పాలకులు దూరదృష్టి కలిగిన స్ఫూర్తిదాయకమైన నాయకత్వాలను జాతికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తెలుగుభాషపై మక్కువ పెంచుకోవాలి

- సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.వెంకటరమణ
- సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఘనంగా తెలుగు వైభవం వేడుకలు

ఎన్.వి. వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఒక్కరూ తెలుగు భాషపై మక్కువ పెంచుకుని, పరిరక్షించుకోవాలని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి వెంకట రమణ పేర్కొన్నారు. శనివారం సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన తెలుగు వైభవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపి బ్రౌన్ బ్రిటిష్ నుంచి మన తెలుగు రాష్ట్రానికి వచ్చి తెలుగు భాషపై మక్కువ పెంచుకొని భాషకు కృషి చేశారన్నారు. సిపి బ్రౌన్ తన మొత్తం జీవితాన్ని తెలుగు భాష కోసం అంకితం చేశారని చెప్పారు. ఇంగ్లీష్-తెలుగు నిఘంటువును తయారుచేసి మనకు అందించారని పేర్కొన్నారు. వేమన పద్యాలను వెలుగులోకి తీసుకొనివచ్చి అందులోని భావాన్ని తెలియజేసి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ఆయన ప్రేరణతో బ్రౌన్ శాస్త్రి కుటుంబ సభ్యులు గ్రంథాలయం కోసం ఎంతో పాటుపడుతూ సిపి బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తెలుగు భాషకు ఎంతో ప్రాచీన స్థానం ఉందని, తెలుగు భాష మాధుర్యం సంగీతం లాంటిదని పేర్కొన్నారు. యునోస్కో తెలుగు భాష అంతరించిపోతుందని తన నివేదికలో తెలిపిందన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగాలు సంక్షేమ కార్యక్రమాలకు పని చేస్తాయని తెలుగు భాష కోసం ప్రజలందరూ కృషిచేసి మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషలో విద్యాభ్యాసం చేస్తే ఉద్యోగాలు రావని భ్రమలో నుంచి బయటికి రావాలన్నారు. తాను వీధి బడిలో చదువుకొని,ఏ డవ తరగతిలో ఇంగ్లీష్ నేర్చుకున్నానని, డిగ్రీ వరకు తెలుగు మీడియంలోనే చదువుకొని భారత ఉన్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశానని వెల్లడించారు. మాతృభాష తెలుగులో వ్యాకరణాలు చందస్సులు నేర్చుకుంటే ఏ భాషనైనా నేర్చుకోవడం సులభతరం అన్నారు. ఆంగ్లభాష నేర్చుకుంటే మేధావులు అవుతారన్న అపోహలను నమ్మొద్దు అన్నారు. బ్రిటిష్ కాలంలో వ్యాపారాల కోసం మేకాలె విద్యా విధానాన్ని తీసుకొని వచ్చి గుమస్తాలను తయారు చేశారన్నారు. ఉద్యోగానికి భాషకు సంబంధం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాష విద్యా విధానాన్ని ప్రోత్సహించాలన్నారు ఇందుకోసం వరద ప్రవాహం నుంచి చేప పిల్లలు కొట్టుకుపోకుండా ఒడ్డున పడేస్తున్న చిన్న కోతి పిల్లను ఉదాహరణగా ఆయన చెప్పుకొచ్చారు. అలాగే మాతృభాషలో విద్యాభ్యాసం ఉండకూడదనే 1985లో తీసుకొచ్చిన జీవోను సుప్రీంకోర్టులో ఉన్న స్పెషల్ లీవ్ పిటిషన్ ఉపసంహరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరానన్నారు. తెలుగు రాష్ట్ర విభజన సమయంలో తెలుగు యూనివర్సిటీకి ఎన్నో ఇబ్బందులు ఏర్పడ్డాయని, భాషాభివృద్ధికి కేంద్రాలుగా నిలుస్తున్న కడప వంటి ప్రాంతంలో తెలుగు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ తెలుగు భాష కోసం ఎంతో కష్టపడి తెలుగు యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. తెలుగు భాషను అభివృద్ధి చేసుకొని జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సిపి బ్రౌన్ గ్రంథాలయంలోని తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. జిల్లాలో మంచి మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం లో ముందుగా ఆయన బ్రౌన్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు మొదటిసారి సిపి బ్రౌన్ గ్రంథాలయానికి రావడం ఆనందంగా ఉందన్నారు. తన మాతృభాష తెలుగు కానప్పటికీ తెలుగు భాషను నేర్చుకొని మాట్లాడుతున్నానన్నారు. జిల్లాలోని ప్రముఖ దర్శనీయ ప్రాంతాలైన గండికోట, దేవుని కడప, దర్గా లాగా సిపి బ్రౌన్ గ్రంథాలయాన్ని కూడా ప్రజలు సందర్శించాలన్నారు. సిపి బ్రౌన్ తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారన్నారు. సిపి బ్రౌన్ ఇంగ్లాండ్ వెళ్లే సమయానికి రూ.50,000 అప్పు కూడా ఉందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. టెక్నాలజీ లేని సమయంలో తాళపత్ర గ్రంథాలను తెలుగు వ్యాకరణాలను భద్రపరిచి ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలిచారన్నారు. తెలుగుపై మక్కువ పెంచుకున్న సిపి బ్రౌన్ యువతకు ఆదర్శ ప్రాయుడన్నారు. కార్యక్రమంలోభారత సుప్రీంకోర్టు విశ్రాంతి న్యాయ మూర్తి వెంకటరమణ సతీమణి శివ మాల, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీదేవి, బ్రౌన్ శాస్త్రి కుమారుడు విజయభాస్కర్, పిచ్చయ్య చౌదరి, వైవీయూ విద్యాలయం ప్రొఫెసర్ పుట్టా పద్మ, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఐర్విన్, నగర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో

6,553 కేసులు పరిష్కారం

- రూ.6.72 కోట్లు కక్షిదారులకు చెల్లింపు

కక్షిదారులకు నష్టపరిహారం చెక్కును అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

ప్రజాశక్తి - కడప

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 20 బెంచీలను ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 6,553 కేసులు పరిష్కరించి రూ. 6,.72,21, 635 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి కేసులను పరిష్కరించుకున్నారని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు గాను న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, పత్రికా సిబ్బందికి, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ అధికారులకు, ఎపి ఎస్‌పి డిసిఎల్ అధికారులకు, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె.హేమ స్రవంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే నందిని, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

అధిక మొత్తంలో కక్షి దారులకు నష్ట పరిహారం చెల్లింపు...

మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో రూ. 83 లక్షల మొత్తానికి వాది అయిన ఎం శ్రావణి, ఇతరులు, ప్రతివాది అయిన చోళ మండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడ్డారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఏ రవీంద్రారెడ్డి, ప్రతి వాది తరపున న్యాయవాది డి.రాజశేఖర్ రెడ్డి ఎం. శ్రావణి పాల్గొన్నారు.. నాలుగవ అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో రూ. 32 లక్షల మొత్తానికి వాది అయిన కందు జ్యోతి, ఇతరులు, ప్రతివాది అయిన బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఆర్. చంద్రబాబు రెడ్డి, ప్రతి వాది తరపున న్యాయవాదులు డి.రాజశేఖర్ రెడ్డి, ఎన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, కందు జ్యోతి పాల్గొన్నారు.

గురువుల పాత్ర ఎనలేనిది

- ప్రభుత్వ విప్ మాధవి
- కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలలో 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కడప శాసన సభ్యురాలు, ప్రభుత్వ విప్ మాధవి, యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. మొదటగా అతిథుల చేత కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవాల వేడుకలకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరించారు. తర్వాత కళాశాలలోని సెమినార్ హాలులో జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల కంటే గురువు పాత్ర చాలా ప్రధానమైందని పేర్కొన్నారు. గురువు ఆశీస్సులతో, గురువు అందించినటువంటి విజ్ఞానంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని అందుకు ప్రత్యక్ష నిదర్శనం తానేనని తెలిపారు. తాను తన అర్థశాస్త్ర గురువు ప్రోత్సాహంతో, ప్రేరణతో విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయగలిగానని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళకు బహుళ నైపుణ్యం గల వ్యక్తులని, మహిళా ఉద్యోగులు ఇంటిపని, ఆఫీసు పనితో ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. మహిళలకు తగిన విశ్రాంతి రక్షణ అవసరమని, మహిళాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సహకాలు, అవకాశాలు అవసరమని చెప్పారు. ఒక మహిళ శాసన సభ్యురాలుగా మహిళల అభ్యున్నతి కోసం, రక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వ్యక్తులని పేర్కొన్నారు. మహిళల బాధ్యతాయుతమైన విధుల వల్ల వారి కుటుంబ సభ్యులకు గౌరవం పెరుగుతుందని తెలిపారు. ప్రతి బిడ్డకు తన తల్లే ప్రథమ ఉపాధ్యాయురాలని పేర్కొన్నారు. భారతదేశంలో మహిళలకు మొదటి నుంచి సమున్నత స్థానం ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో కూడా మహిళలకు మరిన్ని ఉన్నత అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి విద్యార్థి తన గురువు మాటలను గౌరవించి క్రమశిక్షణతో విద్యను అభశించినట్లయితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. ఈ స్వర్ణోత్సవాల వేడుకలకు 50 సంవత్సరాల కాలంలో ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు, ఈ కళాశాలలో పని చేసిన అధ్యాపకులు, ప్రధాన ఆచార్యులు, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఓ. విజయలక్ష్మి, విశ్రాంత రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పూర్వాక్ ప్రధానాచార్యులు సంజీవమ్మ, ప్రేమలత ,రాజమ్మ, రంగారెడ్డి, డాక్టర్ బిఆర్ శైలజ, చరిత్ర అధ్యాపకులు రజియా సుల్తానా, అర్థశాస్త్ర అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివపార్వతి, ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ స్వర్ణోత్సవాల వేడుకలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు అందరూ ఎంతో ఆనందంతో తమ పూర్వ అనుభవాలను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా ఒకరికొకరు పలకరించుకుని వేడుకల్లో మునిగిపోయారు. ఈ స్వర్ణ ఉత్సవాల వేడుకలు విద్యార్థుల సాంప్రదాయాలు నృత్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైన ప్రముఖులు అందరినీ కళాశాల ప్రిన్సిపల్, ఆలుమ్ని అసోసియేషన్ అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

ఎన్నికలు అప్రజాస్వామికం : ఎంపీ

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అవినాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

సాగునీటి సంఘాల ఎన్నికలు విషయంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిపై కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మండిపడ్డారు. అప్రజాస్వామ్యంగా సాగునీటి ఎన్నికలు నిర్వహించారని, ఇది చేత కాని దద్దమ్మ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం అలం కాన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటెక్ రవి మాటలు సినిమాను తలపిస్తు న్నాయన్నారు. సినిమా డైరెక్టర్, నిర్మాత, ప్రేక్షకులు అన్ని ఆయనే అని ఎద్దేవా చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎన్నికలు జరపడం చేతకాని తనం అని అన్నారు. ఎన్నికల్లో రైతులు పోటీ చేయాలంటే, నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పని సరి అని తెలిపారు. ఎన్నికలు కోరుకునే వారైతే ప్రతి రైతుకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండేది అని అన్నారు. విఆర్ఒ లను తహశీల్దార్ కార్యాలయంలో దాచిపెట్టారన్నారు. ఇ క్రాఫ్ విధానం రద్దు చేస్తామని చెప్పి ఎందుకు రద్దు చేయలేదు అని ప్రశ్నించారు. జమ్మలమడుగులో విఆర్ఒలను దేవగుడిలో బంధించినది వాస్తవం కాదా? అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

మీ విధానాన్నే మేమూ పాటిస్తున్నాం : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గత ఐయిదేళ్లల్లో మీరు పాటించిన విధానాలనే తాము పాటిస్తున్నామని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి వైసిపి నాయకులనుద్దేశించి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30ఏళ్లుగా, గత ఐదేళ్ల వైసిపి పాలనలో పులివెందుల నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయాలు చేశారో అందరికీ తెలుసని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిడిఒ కార్యాలయాల వద్ద జీపులు అడ్డుపెట్టి, కుర్చీలు వేసుకుని కూర్చుని నామినేషన్ వేయడానికి వచ్చిన టిడిపి నాయకుల పత్రాలను గుంజుకొని దౌర్జన్యాలకు పాల్పడింది మీరు కాదని ఆయన ప్రశ్నించారు. మీరు నేర్పిన పాఠం ప్రకారమే మేమూ చేస్తే ఓర్చుకోలేని మాటలు అనడం ఏంటని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో మీరు ఏ విధంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించారో.. మేమూ కూడా రెట్టింపులో ఈ అయిదేళ్లు అలాగే పరిరక్షిస్తామన్నారు. దమ్ముంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని, ఎలాంటి పరిస్థితుల్లో పోటీ చేయనీయమన్నారు. ఆ ఎన్నికల్లో కూడా ఇలానే చేస్తామని మీరు నేర్పిన ప్రజాస్వామ్య పద్ధతినే మేము అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, అక్కులుగారి విజయ్ కుమార్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

విద్యతోపాటు క్రీడలూ ఎంతో అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

విద్యతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. పట్టణంలో మొదటిసారిగా వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగి వేమన యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004లో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఈ ప్రాంగంలో ఏర్పాటు చేయుటకు ఎంతో కృషి చేశామని తెలిపారు. ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాలకు ఎదిగారని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడలలో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యా ర్థులు, అధ్యాపకులతో కలిసి ఉత్సాహంగా క్రీడా పోటీలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.జయరామిరెడ్డి, యోగి వేమన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ రమణయ్య, నాగరాజు, వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘునాథరెడ్డి, వైయస్సార్ కాలేజ్ నాన్ టీచింగ్ అధ్యక్షులు రసూల్ గౌస్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని చౌటుపల్లి గ్రామానికి చెందిన జంగమరెడ్డిగారి సుస్మితరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష 18వేల చెక్కును శనివారం జమ్మలమడుగు టిడిపి కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాల్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరూ కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చౌటుపల్లి మాజీ సర్పంచ్ రామలింగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్, పులివెందుల రోడ్డు, రవిరెడ్డి పెట్రోల్ బంక్, ధర్మారెడ్డి రైస్‌మిల్, తిరుమల హాల్ సెంటర్, చింతలమడుగుపల్లె విలేజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

18న ఢిల్లీ ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి -ముద్దనూరు

ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు మాదిగలు తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ బస్‌షెల్టర్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎల్లయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల రిజర్వేషన్ 50 శాతం నుండి 80 శాతం పెంచాలన్నారు. కుల గణాంకాల సేకరణ దేశ వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. దళితులలో పేదరికం, అంటరానితనం నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. దళిత గిరిజనుల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలను జనాభా ప్రాతిపదికన పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుల్లయ్య, మండల ఓబులేసు, కృష్ణయ్య, నాగరాజు, ఓబులేసు, మునెయ్య, బాలాంజనేయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులు

కుక్కలు, పందుల స్వైరవిహారం

భయాందోళనలో వాహనదారులు, వృద్ధులు, విద్యార్థులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో కుక్కలు, పందుల బెడద తీవ్రంగా ఉంది. అవి యథేచ్ఛగా వీధుల్లో తిరుగుతూ వాహనదారులు, వృద్ధులు, విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నారు. పులివెందుల బ్రాహ్మణపల్లి రోడ్డు, మారుతి హాల్ రోడ్డు, పార్నపల్లి రోడ్డు కాలనీ, మెయిన్ రోడ్, ప్రధాన రహదారి ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. బేతాళ చర్చి, ఎరుగుడు పల్లె, నగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో పందుల సంచారం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొంత కాలంగా కుక్కలు, పందుల బెడద ఎక్కువైంది. కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నపిల్లలను కరుస్తున్నాయి. ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కుక్కలు చిన్న పిల్లలను కరిస్తే రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు హడలిపోతున్నారు. వ్యాధులు వ్యాపింపజేయడంలో ముందుండే పందులు అన్ని వీధుల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. చిన్నారులకు మెదడువాపు, డెంగీ, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాపింపజేయడంలో పందులది కీలక పాత్ర. కుక్కలు, పందుల బెడద తీర్చాలని అనేకమార్లు ప్రజలు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం మాత్రం ఉండడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని వీటి బెడదను తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు

తక్షణమే చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒకు ఎమ్మెల్యే 'పుట్టా' ఫిర్యాదు - షోకాజ్ నోటీసులు జారీ

సిబ్బంది హాజరు పట్టీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయపాలన పాటించిన సిబ్బందిపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిఎంహెచ్ఒ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. పిహెచ్‌సిని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సాయంత్రం నాలుగు గంటలు దాటితే ఒక్క నిమిషం కూడా హాస్పిటల్లో సిబ్బంది, డాక్టర్లు ఉండడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది సమయపాలనపై వెంటనే చర్యలు చేపట్టి తమకు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ మడూరు అంగన్వాడీలో పిల్లలను పరిశీలించడానికి వెళ్లారని, డాక్టర్ శ్రీవాణి విశ్వనాథపురంలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొన్నారని, మరో డాక్టరు సెలవుపై వెళ్లారని సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులేసు, సిహెచ్ఒ మహదేవయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి డిఎంహెచ్ఒ షోకాజ్ నోటీసులు

మండల పరిధిలోని పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించలేదని, రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నలుగురు సిబ్బందికి శనివారం జిల్లా వైద్యాధికారి నాగరాజు షాకాజ్ నోటీసులు జారీ చేశారు. శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అకస్మికంగా పిహెచ్‌సిని తనిఖీ చేసి హాజరు పట్టిలో సంతకం చేయని ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు సిబ్బందినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు స్పందించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి, సిహెచ్ఒ మహదేవయ్య, పిహెచ్ఎన్ సుకన్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అంగన్వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు..

మడూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ రాజేశ్‌కుమార్ పరిశీలించి, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బిఎస్‌కే స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల్లో పెదవి చీలిక కనబడుతోందన్నారు. విటమిన్ లోపం రాకుండా పిల్లలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందివ్వాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ పిల్లలను ఆటలాడిపించాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని చింతకుంట, చిన్న దుద్యాలకు సంబంధించి నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవులకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డి, ఎఇ చంద్రకిరణ్ ఎన్నికలను పర్యవేక్షించారు. చిన్న దుద్యాల చెరువు ఆయకట్టు ఉన్న చిన్న దుద్యాల బడుగువారిపల్లె గ్రామాలకు సంబం ధించిన 6 టిసిల సభ్యులు, అధ్యక్షులుగా గాలం పెద్ద గుర్రప్ప, ఉపాధ్యక్షులుగా భూమిరెడ్డి నాగార్జున రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చింతకుంట గ్రామానికి సంబంధించి 6టిసిల సభ్యులు అధ్యక్షులుగా ఎల్లిపాలెం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సాన గురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు ముకుందా రెడ్డి, నాగేశ్వర నాయక్ వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి, వీరభద్రుడు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేంపల్లె : నీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వేంపల్లె మండలంలోని 6 నీటి సంఘాలకు చెందిన గండి వీరాంజనేయ స్పింగ్ చానల్‌కు, కుమ్మరాంపల్లెకు చెందిన గుండ్లమడుగు స్పింగ్ చానల్‌కు, వేంపల్లె పిబిసి కాలువకు, టి.వెలమవారిపల్లె, గిడ్డింగివారిపల్లె చెరువులకు కూటమి పార్టీల వ్యక్తులు నామినేషన్లు వేశారు. వైసిపికి చెందిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు రాకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సిఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెనగలూరు సిఐ వేణుగోపాల్, ఎస్ఐ రంగారావు, ఆర్కేవ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, కృష్ణతేజా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆయా చైర్మన్లు, వైస్ చైర్మన్లను సత్కరించారు.

అలిరెడ్డిపల్లె పంచాయతీలోని ఎద్దుల కొండ కాలువ నీటి సంఘం చైర్మన్‌గా బాలం సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్నాల వీధికి చెందిన బాలం సుబ్రమణ్యం బలిజ సంఘం తరపున ఏకగ్రీవంగా ఎన్నకైనం దుకు టిడిపి, వైసిపిలు మద్దతు ఇచ్చాయి. ఉపాధ్యక్షురాలుగా వేంపల్లె గొల్ల వీధికి చెందిన నంద్యాల గంగమ్మ ఎన్నికయ్యారు.

లింగాల : మండలం పరిధిలో నిర్వహించిన ఒకటి నుంచి 12 టిసిల సాగునీటి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామాపురం గ్రామానికి చెందిన దేవిరెడ్డి గురువిరెడ్డి అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడుగా దొండ్లవాగు గ్రామానికి చెందిన చవ్వ కరుణా కుమార్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి గుత్తి ధర్మేంద్ర కుమార్ తెలిపారు. అభ్యర్థులకు నియామకపత్రాలను ఆయన అందజేశారు. వీరిని టిడిపి మండల బాధ్యుడు దేవి రెడ్డి సంజీవరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరయ్య, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ వెంకటేష్ పాల్గొన్నారు.

కమలాపురం టౌన్ : మండలంలోని రెండు చెరువుల సంఘం చైర్మన్‌లు, రెండు మైలవరం కాలువ సంఘం చైర్మన్‌లు ఎన్నికల్లో ఏకగ్రీవమయ్యారు. కమలాపురం చెరువుకు చాపాటి ప్రభాకర్‌రెడ్డి చైర్మన్‌గా, గుజ్జుల నాగశేఖర్ వైస్ చైర్మన్‌గా, చదిపిరాళ్ల చెరువుకు చైర్మన్‌గా లోమడ రెడ్డమ్మ, వైస్ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైలవరం దక్షిణ కాల్వ ఎర్రగుడిపాడు ఆయకట్టుకు ఏనుగు మండి సురేష్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, వైస్‌చైర్మన్‌గా వడ్డేమాని సావిత్రి, సంబటూరు ఆయకట్టుకు పుత్తా బాలిరెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవం అయినట్లు అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

చాపాడు : సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను అధికారులు శనివారం నిర్వహించారు. మండల పరిధిలో 7 డబ్ల్యూఏలకు ఎన్నికలను నిర్వహించారు. సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. రైతులు ఎలాంటి తారతమ్యాలకు పోకుండా ఏకగ్రీవంగా టీసీలను, డబ్ల్యూఏ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకున్నారు. కెసి కెనాల్ డిఇ పుల్లయ్య, ఎఇ గురుమోహన్ రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి పర్యవేక్షించారు. పార్టీపరంగా వైసిపి నాయకులు సాగునీటి సంఘం ఎన్నికలకు దూరంగా ఉండడంతో, కేవలం టిడిపి నాయకులు మాత్రమే ఎన్నికల్లో కనిపించారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. నీటి వినియోగదారుల సంఘం చైర్మన్‌లుగా డి.గురివిరెడ్డి (అల్లాడుపల్లి), పాలగిరి సత్య వేమారెడ్డి (మిడుతూరు), అంకిరెడ్డిపల్లె నాగిరెడ్డి (సోమాపురం), వజ్రా వీరారెడ్డి (అనంతపురం-1) శెట్టిపల్లి నారాయణరెడ్డి (అనంతపురం-2), లక్ష్మీ నారాయణరెడ్డి (ఉప్పరపల్లె), శ్రీని వాసులరెడ్డి(మడూరు), ఎస్ఆర్ శివ రామకృష్ణారెడ్డి(చియ్యపాడు), నంద్యాల లోకేశ్వర్‌రెడ్డి (మడూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చాపాడు : అల్లాడుపల్లె నీటి సంఘం చైర్మన్‌గా ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న డి.గురివిరెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలో నాలుగు గ్రామాల్లో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ఏకపక్షంగా జరిగాయని పొట్లదుర్తి వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. చిన్నదండ్లూరు, ఇల్లూరు, పోట్లదుర్తి, హను మనగుత్తి పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరిగాయి. ఏర్పాట్లను తహశీల్దార్ శోభన్‌బాబు పర్య వేక్షించారు. చిన్న దండ్లూరులో ఎద్దుల వెంకట సుధాకర్ రెడ్డి, సి వెంకటసుబ్బయ్య, ఇల్లూరులో వేంపల్లి కొండారెడ్డి, బి అశోక్ కుమార్‌రెడ్డి, పోట్లదుర్తిలో వెదురూరు పెద్ద కొండారెడ్డి, టి వేణుగోపాల్, హనుమనుగుత్తిలో మోపూరి ప్రతాప్‌రెడ్డి, బి ఈశ్వర్‌రెడ్డిని చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎంపీడీవో వెంకట రమణ, ఇరిగేషన్ ఏఈ రేష్మ, జాన్సన్, ఎంఈఓ శివప్రసాద్, ఇఓపిఆర్డి రంతులయ్య, సిఐ నరేష్‌బాబు, కలమల్ల ఎస్ఐ తిమోతి, ఆర్ఐ అర్జున్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండలంలో అయిదు సాగునీటి సంఘాల ఎన్నికలలో టిడిపి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వైసిపి మద్దతుదారులు రాకపోవడంతో అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు పరిధిలోని సింహాద్రిపురం సాగునీటి సంఘం అధ్యక్షునిగా సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంకాలమ్మ గూడూరు సాగునీటి సంఘానికి అధ్యక్షునిగా అమర్నాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా ఆనంద్‌రెడ్డి, కసునూరు నీటి సంఘానికి అధ్యక్షునిగా జోగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రతాప్ రెడ్డి, బలపనూరు నీటి సంఘానికి అధ్యక్షునిగా వీరప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలుగా రాజేశ్వరి, హిమకుంట్ల నీటి సంఘానికి అధ్యక్షునిగా సూర్య శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా పద్మనాభరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చక్రాయపేట : నీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఏడు చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాలేటి వాగు ప్రాజెక్ట ప్రెసి డెంట్‌గా లోమల పెద్దయ్యరెడ్డిగారి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సీఎం రాజారెడ్డి, చక్రాయచెరువు ప్రెసిడెంట్ పొట్టి పార్టీ ప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్, నందిమండలం మహమ్మద్ గౌస్, మాధవ పంతుల చెరువు చైర్మన్ గడికోట ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వల్లూరు బసిరెడ్డి, దేశిరెడ్డి చెరువు ప్రెసిడెంట్ బాలయ్య కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ బళ్లారి మస్తాన్ వలి, రేకులు కుంట ప్రెసిడెంట్ కర్నాటి గంగిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెన్నబడి వెంకట సుబ్బారెడ్డి, ఉప్పలకుంట ప్రెసిడెంట్ దిద్దుకుంట వెంకట రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పేరం రామలక్ష్మమ్మ, గండికోవూరు చెరువు ప్రెసిడెంట్ పెద్దపల్లి యశోదమ్మ, వైస్ ప్రెసిడెంట్ రామిరెడ్డిగారి రామచంద్రారెడ్డి కూటమి పార్టీల వ్యక్తులు నామినేషన్లు వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ బివి కృష్ణయ్య, ఆర్‌కెవ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తొండూరు : మండలంలోని గోటూరు గ్రామానికి చెందిన సాగునీటి ఎన్నికల్లో 12 మంది మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు సాగునీటి సంఘం చైర్మన్‌గా గోటూర్ గ్రామం నుండి అన్నారెడ్డి వెంకటలక్ష్మి రెడ్డిని, వైస్ చైర్మన్‌గా ఎర్రిపల్లె గ్రామం నుండి కాకర్ల మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

కాశినాయన : మండలంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 12 నీటి సంఘాలు ఉండగా, అన్ని నీటి సంఘాలు టిడిపి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటుకలపాడు గ్రామానికి చెందిన చెరువుకు చైర్మన్‌గా మురుకుటి చిన్న సుబ్బారెడ్డి, అంబవరంలో అబ్దుల్ రహీం, సావిశెట్టిపల్లె గ్రామంలో విజయ్‌కుమార్ రెడ్డి, సిద్ధాయిపల్లెలో వెంకటేశ్వరరావు, బసనపల్లిలో వెంకట్‌రెడ్డి, బాలరాజుపల్లిలో పంగ రామిరెడ్డి, చెన్నవరంలో చెన్నుపల్లె భాస్కర్‌రెడ్డి, గంగనపల్లిలో బసిరెడ్డి వెంకట్ రెడ్డి, బాలాయపల్లెలో పాలకులను జయరామిరెడ్డి, వరికుంట్లలో బసిరెడ్డి వెంకటరెడ్డి, కొండరాజుపల్లిలో రమణయ్య టిడిపి మండల యువ నాయకుడు హెూండా రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గెలుపొందారు. నరసాపురంలో ఎక్కలూరి సంజీవ రాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

సాగునీటి ఎన్నికలు సజావుగా సాగలేదు

ప్రజాశక్తి -పెద్దముడియం

గుండ్లకుంట జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా సాగలేదని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో నియంత పాలన సాగిస్తోందన్నారు. ఓటు హక్కు అందరూ వినియోగించుకుంటే కూటమి నాయకులకు ఓటమి తప్పదని భావించి, స్థానిక ఎమ్మెల్యే అనుచరులు వీఆర్వోలను తమ ఆధీనంలో ఉంచుకొని రెండు రోజులుగా వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి వారిని రైతులకు అందుబాటులో లేకుండా చేశారని ఆరోపించారు. వైసిపి వారికి చలానాలు దక్కకుండా.. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటర్లుగా పాల్గొనకుండా కూటమి నాయకులు గెలుపొందేలా కుయుక్తులు పన్నారని ఎమ్మెల్సీ విమర్శించారు. వైసిపికి చెందిన భరత్ కుమార్‌రెడ్డి ఎన్నికల కేంద్రం వద్ద కూటమి నాయకులపై అసభ్య పదజాలంతో వీరంగం సృష్టించారు. ఒకింత ఘర్షణ వాతావరణం నెలకొంది. రూరల్ సీఐ గోపాల్ రెడ్డి తమ సిబ్బందితో రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని శాంతపరిచి కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో సాగునీటి సంఘంలోని రైతులు కోట వెంకటేశ్వరరెడ్డి అనే కూటమి నాయకుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాయకులతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మున్సిపాలిటీ సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మున్సిపాలిటీ సమస్యలపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి నాయకులతో చర్చించారు. వైసిపి క్యాంపు కార్యాలయంలో శనివారం మున్సిపాలిటీ లోని సమస్యలపై చైర్మన్ వరప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని డ్రయినేజీ, రోడ్లు, తాగునీరు తదితర వాటిపై చర్చించారు. మరమ్మతల కోసం నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు ఎంపీని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్ కిషోర్, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రసాద్, పార్టీ నాయకులు బలరామిరెడ్డి ఉన్నారు.

మాస్టర్స్ పట్టా పొందిన పోరెడ్డి లక్ష్మీవిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్ల గ్రామానికి చెందిన పోరెడ్డి లక్ష్మివిభ మాస్టర్స్‌లో పట్టా సాధించడంతో పలువురు అభినందించారు. యూఎస్‌లోని ప్రతిష్టాత్మకమైన ఏఅండ్ ఎం(టాక్సెస్) యూనివర్సిటీ నుండి పట్టా తీసుకు న్నారు. రెండేళ్ల నుంచి ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారు. లక్ష్మీవిభ మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోడలు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

డాక్టరేట్ అందుంటుకున్న పుల్లారెడ్డి

రిటైర్డ్ అధ్యాపకుడు పుల్లారెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - ముద్దనూరు

విశ్రాంత అధ్యాపకులు ఓబుళాపురం గ్రామానికి చెందిన బూచుపల్లి పుల్లారెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన కళలు, సామాజిక సేవలు చేసినందుకుగాను శనివారం బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులు డాక్టర్ శ్రీనివాసరావు, సుప్రీంకోర్టు స్టాండింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ రాగ సందేశ్, ఇండియన్ ఆర్మీ కర్నాల్ సంజయ్ కుమార్, యూనివర్సిటీ డీన్ డాక్టర్ స్వామినాథన్ చేతుల మీదుగా పుల్లారెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారెడ్డి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి బెంగళూరు యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

గోనె సంచులకు భలే గిరాకీ

ప్రజాశక్తి - చాపాడు

వరి ధాన్యాన్ని నిల్వ ఉంచే గోనె సంచులకు ప్రస్తుతం మంచి గిరాకీ ఏర్పడింది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 50వేల ఎకరాలలో వరి పంట సాగైంది. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. వరి ధాన్యాన్ని అమ్మకం చేపట్టాలన్న ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి రవాణా సాగించాలన్న, ఇంటిలో నిల్వ ఉంచుకోవాలన్న గోనె సంచులు తప్పక ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ సంచులు కొత్తవి ప్రస్తుతం ఒకొక్కటి రూ.50 వరకు ధర ఉంది. ఒకసారి ఉపయోగించినవి రూ.40 నుంచి రూ.43 వరకు ధర పలుకుతున్నాయి. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి రైతులు గోనె సంచులను కొనుగోలు చేస్తున్నారు. 50 కిలోల బియ్యం సంచులు అయితే రూ.28 లభిస్తున్నాయి. గోనే సంచుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వరిపంట నూర్పిడి పూర్తిస్థాయిలో ప్రారంభమైతే వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రొద్దుటూరు నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్న గోనె సంచులు